పాఠశాల రేకుల షెడ్ నేలమట్టం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని దోడిపుట్టు గ్రామ పంచాయతీ బిడీచంప గ్రామంలో మంగళవారం విపరీతమైన గాలి వానకు ఎంపీపీ స్కూల్ రేకుల షెడ్డు బుధవారం ఉదయం తరగతుల నిర్వహణలో ఉండగానే హఠాత్తుగా నేల మట్టమయింది. విద్యార్థుల పై రేకుల షెడ్డు కూలి పోవడంతో గమనించిన గ్రామస్తులు హుటాహుటిన పరుగులు తీసి ఘటన స్థలానికి చేరుకొని వారిని రక్షించారు. ఉపాధ్యాయురాలు కే సుశీల, మాతృభాష వాలంటరీ పాంగి కామేశ్వరరావు ఘటనా స్థలంలో ఉండి విద్యార్థులకు ఎటువంటి అపాయం జరగకుండా అప్రమత్తతతో విద్యార్థులను కాపాడారు.నాడు నేడుతో పాఠశాలను అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు.

కూలిన షెడ్ వద్ద ఉన్న విద్యార్థులు

జగనన్న వసతి దీవెన నిధులు

రూ.7.25 కోట్లు విడుదల

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో 7,550 మంది తల్లుల ఖాతాలకు రూ.7 కోట్ల 25 లక్షల 42 వేల జగనన్న వసతి దీవెన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం జమ చేసిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. బుధవారం అనంతపురం జిల్లా శింగనమల నియోజక వర్గం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్మోహన్ రెడ్డి నార్పల వేదికగా జగనన్న వసతి దీవెన ఆర్థిక సహాయం విడుదల కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం నుండి ప్రత్యక్ష ప్రచారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో వినూత్నమైన మార్పులు తీసుకుని వచ్చిందన్నారు. ప్రభుత్వ అందిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. జిల్లాలో 5545 మంది గిరిజన విద్యార్థులకు రూ. 5కోట్ల 35 లక్షల12, 500లు, 314 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.29లక్షల 22 వేలు, 500, 1228 మంది బిసి విద్యార్థులకు రూ.1 కోటి 16 లక్షల 60 వేలు, 128 మంది ఇబిసి విద్యార్థులకు రూ.12లక్షల 25 వేలు, 280 మంది కాపు విద్యార్థులకు రూ.26లక్షల 97 వేల 500, తల్లుల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. 10 మంది క్రిష్టియన్ మైనారిటీ విద్యార్థులకు రూ.1 లక్ష, 45 మంది ముస్లిమ్ మైనారిటీలకు రూ.4 లక్షల 25 వేలు జమ చేసారని చెప్పారు. అనంతరం లబ్దిదారులకు మోగా చెక్కును పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ. కొండలరావు, సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎల్.రజని, ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, ఎంపిపి ఎస్.రత్నకుమారి, చింతలవీధి సర్పంచ్ సీతమ్మ, సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, పలువురు తల్లులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న కల్టెర్ సుమిత్‌కుమార్

ఈ ఏడాదీ బాలికలదే హవా

దిగజారుతున్న ఇంటర్ ఫలితాలు

మొదటి ఏడాదిలో 63, రెండో ఏడాదిలో 70 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, ఎంవిపి.కాలనీ: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గతేడాది వలె ఈ ఏడాదీ ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో బాలికల హవా కనిపించింది. రాష్ట్ర స్థాయి ఫలితాలతో పోల్చిచూస్తే జిల్లాలో ఇంటర్ ఫలితాలు గతేడాది కంటే దిగజారాయి. బుధవారం సాయంత్రం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్ ఫలితాలు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో గతేడాది ఇంటర్ మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో ఉమ్మడి జిల్లా మూడో స్థానంలో ఉండగా, ఇప్పుడది ఐదో స్థానానికి పడిపోయింది. రెండో సంవత్సర ఫలితాల్లో నాలుగో స్థానంలో ఉండగా ఈ ఏడాది ఐదో స్థానానికి వచ్చింది. ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరంలో 50,647 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వీరిలో 31,957 (63 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరంలో 42,248 మంది పరీక్షలు రాయగా 29,755 (70శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ తొలి ఏడాదిలో బాలురు 25,806 మంది పరీక్షలకు హాజరుకాగా, 15,835 మంది (61శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 24,841 మంది పరీక్షలకు హాజరుకాగా 16,122 మంది (65శాతం) ఉత్తీర్ణులయ్యారు. రెండో ఏడాదిలో బాలురు 20,459 మంది పరీక్షలకు హాజరుకాగా 14,017 మంది (69శాతం), బాలికలు 21,789 మందికి 15,738 మంది (72శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ఒకేషనల్ మొదటి సంవత్సరంలో 4,380 మందికి 2,209 మంది (50శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరంలో 3,783 మందికి 2,631 మంది (70శాతం) విద్యార్థులు పాసయ్యారు. ఒకేషనల్ మొదటి ఏడాదిలో రాష్ట్రంలో జిల్లాకు ఆరోస్థానం, రెండో ఏడాదిలో మూడో స్థానం దక్కింది.

మొదటి ఏడాది	హాజరు	ఉత్తీర్ణత	శాతం
బాలురు	25,806	15,835	61
బాలికలు	24,841	16,122	65
మొత్తం	50,647	31,957	63

రెండో ఏడాది	హాజరు	ఉత్తీర్ణత	శాతం
బాలురు	20,459	14,017	69
బాలికలు	21,789	15,738	72
మొత్తం	42,248	29,755	70

డొంకరాయిలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

ప్రజాశక్తి -సీలేరు

ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయంలో నీటిమట్టాలు తగ్గుముఖం పట్టడంతో డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో అధికారులు విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. 1037 నీటి సామర్థ్యం గల డొంకరాయి జలాశయములో 948.8 అడుగులకు తగ్గిపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీరు కేకేవి. ప్రశాంత్ కుమార్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ డొంకరాయి జలాశయంలో 990 అడుగులకు నీటిమట్టం తగ్గిపోతే డొంకరాయి జల విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడం అసాధ్యమని వెల్లడించారు. అంతేకాకుండా 990 అడుగుల నీటిమట్టం ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేస్తే యూనిట్లు వైబ్రేషన్ గురవుతాయని, అందువల్లే ముందస్తు చర్యలో భాగంగా యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో మాచ్ ఖండ్ జల విద్యుత్ కేంద్రం, డుడుమ డ్యాం నుంచి బలిమెల జలాశయానికి 3200 క్యూసెక్కులు నీరు వస్తుందని చెప్పారు. బలిమెల జలాశయంలో ఆంధ్ర వాటా 9.5 టీఎంసీలు, గుంటవాడ రిజర్వాయర్, డొంకరాయి జలాశయంలో 3.5 టిఎంసిలు కలుపుకొని ప్రస్తుతం 13 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈఏడాది జూన్ చివరి వరకు నేటి నిల్వలను పొదుపుగా వాడుకుంటూ విద్యుత్ ఉత్పత్తి అవసరాలకు, తాగునీటికి వినియోగిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు, పోల్లూరు జల విద్యుత్తు కేంద్రాల్లో అత్యవసర సమయాల్లో గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేయడం జరుగుతుందని ప్రశాంత్ కుమార్ తెలిపారు.

నీటిలో మునిగి విద్యార్థి మృతి

-హైవే పనుల్లో భాగంగా గోతుల తవ్వకం
-వర్షానికి సమృద్ధిగా చేరిన నీరు
-జాతీయ రహదారి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ఆందోళన
-రూ.4లక్షల నష్ట పరిహారం చెల్లింపు

ప్రజాశక్తి-హుకుంపేట : జాతీయ రహదారి పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఓ బాలుడి నిండు ప్రాణాలను బలి తీసుకుంది. రహదారి నిర్మాణం కోసం తవ్వి వదిలేసిన నీటి గుంటలో ఈతకు దిగి మజ్జి.జ్ఞాన దిపక్(10) విద్యార్ధీ మతి చెందాడు. ఈ ఘటన అల్లూరి జిల్లాలోని హుకుంపేట మండల కేంద్రంలో జరిగింది. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మజ్జి, కృష్ణ, సుజాత దంపతుల కుమారుడు మజ్జి జ్ఞాన దీపక్ ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి మండల కేంద్రలోనే చదువుతున్నాడు. పిల్లలతో కలిసి ఆడుకోడానికి వెళ్లిన జ్ఞాన్ దీపక్ తిరిగి ఇంటికి రాక పోవడంతో మంగళవారం సాయంత్రం పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేశారు. పంచాయతీ కార్యాలయం దగ్గరలో ఉన్న నీటి గుంటలో వెతికారు. ఆచూకి దొరకలేదు. దీంతో బుధవారం తెల్లవారుజామున తల్లిదండ్రులు, బంధువులు గ్రామస్తుల సహాయంతో నీటి కుంటలో దిగి బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. దీంతో తల్లితండ్రులు దుఃఖంలో మునిగిపోయారు. ఇదిలా ఉండగా జాతీయ రహదారి కాంట్రాక్టు నిర్లక్ష్యం కారణంగా తమ కుమారుడు చనిపోయినట్లు కుటుంబ సభ్యులు, గిరిజన సంఘం, సిపిఎం, ప్రజా సంఘాలు నేతలు తెలిపారు. బాలుడి మృతదేహాన్ని జాతీయ రహదారిపై ఉంచి ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులకు తగు న్యాయం చేసే వరకు ఇక్కడ నుండి కదిలేది లేదని ఆందోళన చేశారు.

మృతదేహాన్ని తీసుకొస్తున్న బందువులు

ఆందోళన చేస్తున్న నేతలు, కుటుంబీకులు

గిరిజన సంఘం నేత తాపుల కృష్ణారావు ఆధ్వర్యంలో అఖిలపక్షం పార్టీ ల నేతలు సంఘట స్థలంలో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ఆందోళనలు చేపట్టారు. పరిస్థితిని తెలుసుకున్న ఐటీడీఏ పీఓ వీ.అభిషేక్ ఘటన స్థలికి చేరుకుని కుటుంబాన్ని పరమర్శించారు. కలెక్టర్ తో మాట్లాడి కుటుంబీకులకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. పోరాటానికి దిగి వచ్చిన హైవే అధికారులు 4 లక్షల రూపాయల నష్ట పరిహారం చెల్లించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మండల పరిషత్ వైస్ ఎంపీపీ, సీపీఎం నాయకులు సూడిపల్లి కొండలరావు, వైసీపీ యువజన విభాగం నేత నైని సత్తిబాబు, టీడీపీ నాయకులు, హుకుంపేట వార్డ్ మెంబర్ పాడి వెంకట్, కాంగ్రెస్ నాయకులు జన్ని అప్పారావు ఉన్నారు.

హిందీ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలో వేసవి దృష్ట్యా స్పోకెన్ హిందీ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని హిందీ ఉపాధ్యాయులు కొర్ర రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ నేర్చుకోవడానికి వయసుతో పని లేదన్నారు. ఆసక్తి ఉన్న వారు ప్రతి రోజు సాయంత్రం 6గంటలకు తమ స్పోకెన్ హిందీ కార్యాలయానికి నేరుగా రావాలని కోరారు.

ఘనంగా మల్లమ్మతల్లి జాతర

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని సాగర పంచాయతీ ఆడపవలస గ్రామంలో మల్లమ్మ తల్లి గుహ జాతర పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా చుట్టుపక్క గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో భక్తులతో మల్లమ్మ తల్లి గుహ కిటకిటలాడింది. గిరిజన సంప్రదాయమైన థింసాతో పాటు పలు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర సందర్శించి జాతరను తిలకించారు. ఈ కార్యక్రమంలో మల్లమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ, పి.మోహన్, అధిక సంఖ్యలో గిరిజనులు తరలి వచ్చారు.

త్వరలో డ్రైవింగ్ లైసెన్స్ మేళా

చింతపల్లి ఎఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

ప్రజాశక్తి -సీలేరు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో డ్రైవింగ్ లైసెన్స్ మేళా త్వరలో నిర్వహించడానికి చర్యలు చేపడుతున్నట్లు చింతపల్లి అడిషనల్ ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వెల్లడించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల చింతపల్లి ముత్యాలమ్మ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములో ఫిర్యాదుల విభాగానికి యువకులు డ్రైవింగ్ లైసెన్స్ కల్పించాలని సుమారు 1000 వినతలు వచ్చాయని తెలిపారు. ఈ క్రమంలోనే చింతపల్లిలో డ్రైవింగ్ లైసెన్స్ మేళా త్వరలో పోలీస్ శాఖ ద్వారా చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. అనుమతుల కోసం దీనిపై కలెక్టర్, ఐటిడిఎ పిఓ, రవాణా శాఖ అధికారులకు లిఖితపూర్వకంగా సమాచారాన్ని చేరవేస్తామన్నారు. ప్రత్యేకంగా నిరుద్యోగ యువకులకు లైసెన్స్ మేళా కార్యక్రమం చేపట్టడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చింతపల్లిలో లైబ్రరీని దిక్సూచి పేరిట ఆధునికీకరిస్తామన్నారు. గంజాయి నిర్మూలన, బాల్యవివాహాలు, మద్యం, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై గిరిజన యువతను చైతన్యపరిచే విధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల ఆకట్టుకునే విధంగా వీడియోలు రూపొందించి వాటితో వినోదభారతి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. వారపు సంతల్లో గిరిజనులకు ఉపయోగపడే విధంగా మొబైల్ ఆధార్ సేవలను కొనసాగిస్తామని, వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తీర్మాన కాపీని అందజేస్తున ప్రజాప్రతినిధులు

బోయ/ వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చొద్దు

మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వ సభ్య సమావేశంలో ఏర్పాటు చేశారు.అన్ని శాఖల అధికారులతో పాటు మండలం లోని 33 పంచాయతీల సంబంధించిన ఎంపీటీసీలు, సర్పంచ్లు పాల్గొన్ని పంచాయతీల్లో పలు సమస్యలు, నిధులు కోసం సమీక్షించారు.గ్రామాల్లో ఉన్న రోడ్లు, పీవీపీటీజీ లకు 35 కేజీల బియ్యం, అంత్యోదయ రేషన్ కార్డులు, ఆర్ ఓఎఫ్ఆర్ పోడు పట్టాల గ్రాంట్, సాగు, తాగునీరు, డ్రైనేజీ, తారు రోడ్ల మంజూరు వంటి పలు అంశాలపై సీపీఎం వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు పలువురు నేతలు సమావేశంలో ప్రశ్నించారు. అనంతరం ప్రభుత్వం బోయ/వాల్మీలను ఎస్టి జాబితాలోకి చేరుస్తూ మార్చి 24న అసెంబ్లీలో చేసిన తీర్మానంకు వ్యతిరేకంగా సమావేశంలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు ప్రవేశ పెట్టిన తీర్మాణంను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి ముక్తకంఠంతో ఖండించారు. ఎంపీపీ కూడా రాజుబాబు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రేగం మత్స్య లింగం, ఎంపీడీఓ ఆర్ వెంకటరావు, సీడీపీఓ సిహెచ్ బాలమణి దేవి, అధికారులు, ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు, భూర్జా ఎంపీటీసీ మజ్జి హరి, కొట్నాపల్లి ఎంపీటీసీ సొంబే బాలకష్ణ, సూకూరు ఎంపీటీసీ కిలగడ సింహాచలం, సంతారి ఎంపీటీసీ సభ్యులు సుశీల, బాకూరు ఎంపీటీసీ సభ్యులు నైని రజని, సర్పంచ్‌లు రేగం రమేష్, ఎస్.శాంత కుమారి, టీ ముత్యాలమ్మ, పీ.లక్ష్మీ, సోకేళి కృష్ణారావు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు: -మండలంలో బంగారుమెట్ట గ్రామ పంచాయతీ పరిధి మెట్టబాది పుట్టు గ్రామంలో జిల్లా స్థాయి సమ్మర్ మెగా వాలీబాల్ టోర్నమెంట్ ను గ్రామ యువత ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సర్పంచ్ వి.రత్న, ఎంపీటీసీ సిహెచ్ కొండమ్మలు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్లో జిల్లాలో వివిధ మండలాల నుండి టీములు పాల్గొనున్నాయి. 29వ తేదీ వరకు టోర్నమెంట్ నిర్వహిస్తామని యువత వెల్లడించారు. ఈ టోర్నమెంట్లో మొదటి స్థాయి విజేతలకు బహుమతి రూ.20000, షీల్డ్, రెండవ విజేతలకు బహుమతి రూ.10000, షీల్డ్, మూడో విజేతలకు రూ.5000 లతోపాటు షీల్డ్ ను అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వి కొండలరావు, జయదేవ్, జగన్నాధం, మోహన్, వార్డ్ మెంబర్ నాగేష్, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్

యువతీ యువకులందరికీ ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

ప్రచార భేరిలో సిపిఎం నేత సత్యనారాయణ డిమాండ్

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం నిర్వాసితులు తమ గ్రామాలను ఖాళీ చేసే రోజునే కటాఫ్ డేట్‌గా ప్రకటించి యువతీ యువకులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి 2017 సంవత్సరాన్ని కటాఫ్ డేట్‌గా ప్రకటించటం వల్ల అనేక మంది యువతీ యువకులు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. చివరి నిర్వాసితునికి ఆర్ అండ్ ఆర్, భూమి, నష్టపరిహారం ఇచ్చిన తరువాతే గ్రామాలను ఖాళీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీల పిలుపు మేరకు మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ పరిధి చొక్కనపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి సిపిఎం నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం చాలా అన్యాయం చేస్తుందని, బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల ఇక్కడి గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఈ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తోడం రాజు, మాజీ సర్పంచ్ బూబమ్మ, వంకు సత్తిబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, గుండిపూడి లక్ష్మణరావు, సిహెచ్ హజరత్, నాల్నరపు చంద్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార భేరిలో నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

తాగునీటి పథకాలను పునరుద్ధరించాలి

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, కరెంటు సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నమటపల్లి పంచాయతీ పరిధి దర్భలంక, సున్నం మట్కా, వెంకంపాలెం గ్రామాల్లో సిపిఎం నాయకులు బుధవారం ప్రచార భేరి నిర్వహించారు. గొంది కన్నయ్య చెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ మూడేళ్ల నుండి దర్భలంక, సున్నంమట్కా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్నా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. పెద్ద మట్టపల్లి నుండి వెంకంపాలెం వరకు రోడ్లు గోతులు పడి ఉందని, రాత్రి సమయంలో ఆస్పత్రులకు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వడ్లాది రమేష్, కుంజ నాగిరెడ్డి, కార్యకర్తలు మడకం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

గుమ్మరేవులలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ తోకరాయిలో బుధవారం 104 ద్వారా వైద్య శిబిరం నిర్వహించారు. దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగభూషణం హాజరై గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ వారి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చేరుకొని వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పోతురాజు, గోవిందు, ఏఎన్ఎంలు శోభ, ఈశ్వరి, ఐసిడిఎస్ దారకొండ సెక్టార్ సూపర్వైజర్ కృష్ణకుమారి, అంగన్వాడీ కార్యకర్త ఎం.లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగభూషణం

మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

మేడేను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను కార్మికులందరూ విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పి.రామరాజు, చిన్ని రాంబాబు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సిఐటియు మండల నాయకులు కె.రాంబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన మేడే సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. 8 గంటల పని దినం కోసం జరిగిన కార్మిక పోరాటమే మేడేగా ప్రసిద్ధి కెక్కిందని తెలిపారు. ప్రపంచంలోని అన్ని దేశాలలో కార్మిక వర్గం 8 గంటల పని దినాన్ని సాధించిందని చెప్పారు. నేడు కార్మిక హక్కులను నిలుపుకునేందుకు మరో పోరాటం చేయవలసిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నిధులు వారికే ఖర్చు చేయాలన్నారు. మండలంలో జరిగే మేడే వేడుకల్లో అంగన్‌వాడీ, ఆశ, మిడ్డేమీల్ వర్కర్లు, తాపీ పనివార్ల సంఘం ఎలక్ట్రికల్, కార్పెంటర్, హమాలీ, ఆటో, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు చంద్రావతి, అమ్మిరాజు, కె శివప్రసాద్, నాగేంద్ర, కామరాజు, నూకరాజు, పి ప్రసాద్, మాణిక్యం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ మారుపూజ

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం మారెమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం మారుపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడి రూపంలో వచ్చిన చీరలను ఆలయ కమిటీ నాయకులు వేలంపాట నిర్వహించారు. వంద రూపాయల నుంచి సుమారు రూ.500 వరకు వేలంపాట ద్వారా భక్తులు చీరలను దక్కించుకోవడానికి పోటీపడ్డారు.

అమ్మవారి చీరల వేలం పాటలో పాల్గొన్న మహిళలు

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విభిన్న ప్రతిభావంతులకు పక్కాగా పథకాలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మెరుగైన వైద్య సేవలు, సదుపాయాలు కల్పించాలని సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుండి దివ్యాంగుల సంక్షేమ, స్వయం సహాయ సంఘాల అమలుపై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వికలాంగ పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. దివ్యాంగుల పథకాలు అమలు పర్యవేక్షణకు సమస్యల పరిష్కారానికి ప్రతి శాఖలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ఆదేశించారు. అనంతగిరి, అరకువ్యాలీ మండలాల్లో సదరం క్యాంపులు నిర్వహించాలని సూచించారు. దివ్యాంగులకు మెరుగైన వైద్య సేవలందించే విధంగా వైద్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి ఆదేశించారు. వికలాంగుల హక్కులు, చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. బడిఈడు ఉన్న దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించాలని అవసరమైన చర్యలు చేపట్టాలని డిఇఒను ఆదేశించారు. బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల డేటా సేకరించాలని పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలు జారీ చేస్తున్నామన్నారు. గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో ఆన్ లైన్ లో దరఖాస్తు చేయాలని చెప్పారు. ఈ కార్డులు అన్ని విధాలుగా విభిన్న ప్రతిభావంతులకు ఉపయోగ పడతాయన్నారు. అనంతరం దివ్యాంగుల యుడి ఐడి గుర్తింపు కార్డుల పొందు విధానంపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హ, పాడేరు రంపచోడవరం పిఒలు వి.అభిషేక్, సూరజ్ గనోర్, జిల్లా వైద్యాధికారి జమాల్ బాషా, డిఇఒ సలీమ్ బాషా, ఐసిడిఎస్ కె.లావణ్య కుమార్, పిడి డిఆర్‌డిఎ.మురళి, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందరబాబు, ఎల్‌డిఎం. ఎం.రవితేజ, శ్రేయ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ ఉష పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో సమవేశానికి హాజరైన హెచ్‌ఎంలు

నల్ల బ్యాడ్జిలతో హెచ్‌ఎంల హాజరు

ప్రజాశక్తి -అనంతగిరి: రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉపాధ్యాయుల పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యన ప్రధాన ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో సమావేశానికి హాజరయ్యారు. బుధవారం మండల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి ఎల్ బి.వెంకటరావు ఆధ్వర్యన జరిగిన సోషల్ ఆడిట్ ఓరియంటేషన్ సమావేశానికి మండలంలోని ప్రైమరి, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ప్రాధానోపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో హాజరయ్యారు. ప్యాప్టో పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఏకపక్ష నిర్ణయాలతో అక్రమంగా సస్పెండ్ చేయడం సమంజసం కాదన్నారు. అక్రమ సస్పెండ్స్ తక్షణమే నిలుపుదల చేయాలని, లేకుంటే మరింత పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్‌ఎంలు స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా. అధ్యక్షులు పుడిగి దేముడు, మండల నాయకులు రాంబాబు, వి.వి.ఈశ్వరరావు, మలేష్, ప్రదానోపాద్యాయులు బి.మంగ, జి.మల్లేశ్వరి, సైమన్, అప్పాలస్వామి పాల్గొన్నారు.

డిఆర్‌సిలో అంశాలపై సత్వర చర్యలు

◆ వీధిలైట్లు, పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి
◆ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజిని

డిఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జిల్లా సమీక్షా మండలి సమావేశంలో చర్చించిన ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఆరోగ్య, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజిని కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా మండలి సమావేశం మంత్రి విడదల రజిని అధ్యక్షతన బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా గత డిఆర్‌సి లో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదికపై చర్చించారు. తదుపరి జివిఎంసికి చెందిన అభివృద్ధి పనులు, విఎంఆర్‌డిఎ, జగనన్న హౌసింగ్, గృహ నిర్మాణ శాఖ, ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, నాడు- నేడు, ప్రాధాన్యత భవనాలు, ఆర్‌బికెలు, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా పోలీస్ పెట్రోలింగ్ పెంచి యువత పెడదారి పట్టకుండా నిరోధించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సి.సి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వీధి లైట్లను మూడు నెలలలోగా ఏర్పాటుచేయాలని, పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం జరపాలని, అవసరమైన సిబ్బందిని ఏర్పాటుచేసుకోవాలని జివిఎంసి కమిషనర్‌కు సూచించారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ, సింహాచలం బిఆర్‌టిఎస్ రోడ్డు నిర్మాణానికి ఉన్న అవరోధాలను అధిగమించి పూర్తి చేయాలన్నారు. దీనికి సంబంధించి 900 మీటర్ల పరిధిలో భూ సమస్య , 1.1 కి.మీలో స్ట్రక్చర్స్ గుర్తించామని వీటికి నష్ట పరిహారం సమస్య త్వరలో పరిష్కారమవుతుందని చెప్పారు. 4 నియోజకవర్గాల్లో రోడ్ల పనులను గుర్తించి త్వరలో పూర్తిచేయాలని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. రోడ్లలో వీధి దీపాలు, మంచి నీటి సమస్యలను పరిష్కరించాలన్నారు.

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, వీధి లైట్లకు సంబంధించి టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయ్యాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వీధి లైట్లకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్‌ను కేటాయించాలని జివిఎంసి కమిషనర్‌ను కోరారు. భీమిలి నియోజకవర్గంలో కొత్తగా సిహెచ్‌సి ఏర్పాటు చేసి వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో 85, 87వ వార్డుల్లో వీధి దీపాలు, తాగునీరు సమస్య అధికంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని, మున్సిపల్ నీటి కుళాయిల విడుదల సమయాన్ని ఒక గంట పాటు పెంచాలని కోరారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, పాడు పడిన ప్రియదర్శిని స్టేడియం భవనాన్ని పునర్నిర్మించాలని, కనకమహాలక్ష్మి దేవాలయం పరిసరాలను, రోడ్డును విస్తరించాలని కోరారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గంలో పలు రోడ్డు పనులు పెండింగులో ఉన్నాయని, వాటిని పూర్తిచేయాలని, సుజాతనగర్‌లో పందుల సమస్యను పరిష్కరించాలని కోరారు. విఎమ్ఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ, అరిలోవ, యూనివర్సిటీలో పలు చోట్ల అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, పోలీస్ అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ, యుఎల్‌సి భూములలో ఇల్లు కట్టుకున్న వారు గతంలో ఇచ్చిన జీవోలో ఫీజులు చాలా అధికంగా ఉన్నందున ఇప్పుడు స్లాబ్ సిస్టం ద్వారా టైటిల్ డీడ్ పొందుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ సమీక్షలో మేయర్ గొలగాని హరి వెంకట్ కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, వేపాడ చిరంజీవిరావు, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చిన్నతల్లి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎఇఇ రాంబాబుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కండ్రుం పంచాయతీ జాకరగూడ గ్రామంలో మంచినీటి పథకం సరఫరాకు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ గత ఏడాది చోరీకి గురైందని, నూతనంగా ఏర్పాటు చేయాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు విద్యుత్ శాఖ ఎఇఈకు రాంబాబుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతుకు గురవ్వడంతో ఆ గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక ఏడాది నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తప్పని పరిస్థితిలో ఆ గ్రామానికి సుమారు అర కిలోమీటర్ దూరంలో ఉన్న గెడ్డ నీటిని సేకరించి కలుషితమైన నీటిని ఉపయోగిస్తున్నారన్నారు. తక్షణమే గ్రామంలో నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ మంజూరు చేసి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్, ఉపసర్పంచ్ సత్యనారాయణ, గిరిజన సంఘం నాయకులు కె.రామచంద్రరావు, టి.వర్మన్, కె.గోవర్ధన్, సద్దు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసిబి సోదాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జగదాంబ జంక్షన్ సమీపంలోని విశాఖపట్నం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసిబి అదనపు ఎస్పీలు షకీలా భాను, శ్రావణి ఆధ్వర్యాన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు సోదాలు చేసినట్లు తెలిపారు. అదనపు ఆదాయం, అనధికార వ్యక్తుల గుర్తింపు ఏమీ జరగలేదని చెప్పారు. ఎసిబి సిఐలు శ్రీనివాస్, కిషోర్, విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సతీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. రాత్రి కూడా తనిఖీలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పలు తహశీల్దార్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఎసిబి సోదాలు నిర్వహించారు.

భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించండి

ప్రజాశక్తి-విశాఖపట్నం : వార్డులలో చాలా చోట్ల భవన నిర్మాణ వ్యర్థాలు ఉన్నాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. 19వ వార్డు పరిధి లాసెన్స్ బే కాలనీలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, "క్లాప్" వాహనాల ద్వారా చెత్త సేకరణ పక్కాగా జరుగుతున్నప్పుడు వ్యర్థాలు గుట్టలుగా రోడ్డుపై ఎందుకుంటున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ప్రశ్నించారు. ఎంవిపి రైతుబజార్ వద్ద ఫుట్‌పాత్‌ను దాటి దుకాణదారులు ఆక్రమణలు చేపడుతున్నారని, వాటిని తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఐటి సెజ్ ప్రాంతాన్ని పరిశీలించారు.

కార్యదర్శులు అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్లానింగ్ కార్యదర్శులు నిబద్ధతతో పనిచేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆంధ్ర యూనివర్సిటీ అంబేద్కర్ భవనంలో ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఫుట్ పాత్ ఆక్రమణలు, భవన నిర్మాణ వ్యర్థాలు, జివిఎంసి ఆస్తుల పరిరక్షణ, ప్లానింగ్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆదేశించారు. ప్లాన్ మంజూరుతోపాటు భవన నిర్మాణదారులు ప్లాన్ ప్రకారం ఇల్లు నిర్మిస్తున్నదీ లేనిది చూడాలన్నారు. వీధివిక్రయ దారులకు అనుకూలంగా దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు క్రమ పద్ధతిలో ప్లాన్ ఇవ్వాలన్నారు.

తానా మహాసభలకు జియ్యాని శ్రీధర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) తరుపున ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో ఈ ఏడాది జూలై 7వ తేదీ నుంచి 9వ తేది వరకు జరగబోయే తెలుగు మహాసభలకు ఆహ్వానాన్ని విశాఖ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అందుకున్నారు.

చింతపండును జిసిసి కొనుగోలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ఆదివాసీ గిరిజనులు సేకరిస్తున్న చింతపండును జి.సి.సి కొనుగోలు చేయాలనీ సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స డిమాండ్ చేశారు. బుదవారం అరకులోయ సిపిఎం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఆదివాసీలు సేకరిస్తున్న చింత పండు కేజీ రూ.32 నుంచి 40లకు మాత్రమే జి.సి.సి కొనుగోలు చేస్తుందన్నారు. జి.సిసి సరైన మద్దతు ధరకు కొనుగోలు చేయలేదన్నారు.ఆదివాసీ గిరిజన తెగలు సేకరిస్తున్న చింతపండు గత ఏడాది సక్రమంగా దిగుబడి లేదని, ఈ ఏడాది దిగుబడి, సేకరణ పెరిగిందని జి.సి.సి మాత్రం కేవలం 1000 టన్నులు మాత్రమే చింతపండు కొనుగోలు చేసి చేతులు దులుపుకుంటుందని విమర్శించారు. పార్వతిపురం, సీతంపేట జి.సి.సి డివిజన్ పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ కొనుగోలు పూరయ్యిందని, ఇక కొనుగోలు చేయవద్దని జి.సి.సి ఉన్నతాధికార్లు ఆదేశాలు ఇచ్చినట్లు సిబ్బంది చెబుతున్నారని అన్నారు. పాడేరు, అరకు, చింతపల్లి,పెదబయలు, కాశిపట్నం, జి కె వీది, కొయ్యూరు జి.సి. సి. సొసైటీల ఆధ్వర్యంలో చింత పండు కొనుగోలు చేయక పోవడంతో దళారుల వద్ద చింత పండు కేజీ కేవలం రూ.23 నుండి 25లకు కొనుగోలు చేస్తూ మోసం చేస్తున్నారన్నారు. గిరిజన

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రాంతాల్లో సుమారు 1000 టన్నుల చింత పండు కొనుగోలు కు అవకాశం ఉందని తెలిపారు. వారపు సంతల కేంద్రాలు దోపిడీ కేంద్రాలుగా మారాయని, దళారులు గిరిజనులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కనీసం తూనికలపై అధికార్లు కూడా పర్యవేక్షణ చేయలేదన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు, నాయకులు పొద్దు బాలదేవ్ పాల్గొన్నారు.

యుఎల్‌సి పట్టాలకు పూర్తి హక్కులు

పట్టాల్లో సవరణ, శ్లాబ్ విధానంలో రిజిస్ట్రేషన్‌కు ఛాన్స్
కరెక్షన్ మాడ్యూల్ ప్రారంభించిన జెసి విశ్వనాథన్

కరెక్షన్ మాడ్యూల్ ప్రారంభిస్తున్న జెసి విశ్వనాథన్

ప్రజాశక్తి - కరాస : యుఎల్‌సి భూములలో ఇల్లు కట్టుకుని, గతంలో పట్టాలు పొందిన లబ్ధిదారులు కన్వేయన్స్ డీడ్ పొందుటకు, అలాగే పట్టాల్లో సవరణలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అన్నారు. బుధవారం గోపాలపట్నం మండలంలోని 52వ వార్డు సచివాలయంలో దీనికి సంబంధించి కరెక్షన్ మాడ్యూల్ అప్లికేషన్ ప్రారంభించి, వచ్చేనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, గతంలో జిఓ 301, 388 ద్వారా పట్టాలు పొందిన హక్కుదారులు కన్వేయన్స్ డీడ్ పొందేందుకు, పట్టాల్లో మార్పులు చేర్పులకు ప్రభుత్వం సవరణ జిఒలు 71,72 ఆర చేసిందన్నారు. గతంలో పట్టాలు పొంది, అవసరానుకూలంగా వాటిని అమ్ముకోవడానికి, బదలాయింపునకు వీలులేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడ్డ లబ్ధిదారులకు ఇదొక మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అలాగే యుఎల్‌సి భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి శ్లాబ్ విధానంలో కన్వేయన్స్ డీడ్ పొందుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. 150 గజాలలోపున్న లబ్ధిదారులకు డీపట్టా ఇచ్చి, పదేళ్ల తర్వాత పూర్తి హక్కులు కల్పిస్తారన్నారు. 150 నుంచి 300 చదరపు గజాల వరకు 15శాతం కన్వేయన్స్ ఫీజుతోనూ, 300 నుంచి 500 గజాల వరకు 30శాతం ఫీజు, 500 చదరపు గజాలకు పైబడి ఉన్న స్థలాలకు వందశాతం కన్వేయన్స్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, దీనికి ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్నవారు సమీప సచివాలయంలో దరఖాస్తు పొంది వినియోగించుకోవాలని సూచించారు.

నెహ్రూ ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్‌పై సదస్సు

ప్రజాశక్తి- మధురవాడ : భారత్ అమెరికా దేశాల మధ్య మేధోపరమైన సహకారానికి ఇండో యుఎస్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా భారతీయ పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులకు అందిస్తున్న నెహ్రూ ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్‌పై బుధవారం గీతం వర్సిటీలో ప్రత్యేక సదస్సును నిర్వహించారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ు యుఎస్-ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ భారతీయ వ్యవహారాల మేనేజర్ గాయత్రీ సింఘాల్ పాల్గొని,.భారతీయులకు బోధన, పరిశోధనలలో, విదేశీ భాషా విభాగంలో అందిస్తున్న వివిధ స్కాలర్‌షిప్‌ల వివరాలు, వాటికి కావలసిన అర్హతలు, దరఖాస్తు విధానం వంటి అంశాలపై అవగాహన కలిగించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరక్టర్, ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్ గ్రహీత ప్రొఫెసర్ నళినీ బిక్కిన తనకు లభించిన అవకాశాలను, గుర్తింపును వివరించారు. గీతం అదర్ కెరీర్ ఆప్షన్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.రవికాంత్ తమ విభాగం ద్వారా ఉన్నత విద్యావకాశాలతో పాటు దేశ,విదేశాలలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు అందిస్తున్న స్కాలర్‌షిప్‌లపై అవగాహన కల్పించారు.

118 బోర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సమ్మర్ క్రాష్ ప్రోగ్రాం లో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 118 చేతి పంపులకు మరమ్మతులు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ దుర్గాంబ తెలిపారు. భీమిలి మండలంలో 609 బోర్లకుగాను 15, ఆనందపురంలో 851కి 59, పద్మనాభంలో 676 బోర్లకు గాను 44బోర్లకు మరమ్మతులు చేసినట్లు తెలిపారు.

అశనిపాతంగా 60 ఏళ్ల నిబంధన!

ఉద్యోగమొచ్చినా నిరుద్యోగులుగా మిగిలిపోయాం!
డిఇఒ కార్యాలయం వద్ద డిఎస్‌సి98 అభ్యర్థుల ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : డిఎస్‌సి 1998లో ఉత్తీర్ణులై, ఉద్యోగానికి అర్హత సాధించినా 60 ఏళ్ళు పైబడ్డ వారికి ఉద్యోగం కల్పించక పోవడంతో తిరిగి తామంతా నిరుద్యోగులుగా మిగిలిపోయామని డిఎస్‌సి-98 అభ్యర్థులు వాపోతున్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం జిల్లా విద్యాశాఖాధికారిణి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. డిఇఒకు వినతిపత్రం అందించారు.

డిఎస్‌సి 1998లో అర్హులైన అభ్యర్థులకు ఇటీవల ఎంటిఎస్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2023 మార్చి 15 నాటికి 60ఏళ్లలోపున్న వారికే ఉద్యోగాలిచ్చారు. దీంతో 60ఏళ్ల నిబంధనలతో డిఎస్‌సిలో అర్హులైనప్పటికీ, జిల్లా సుమారు 40 మంది మళ్లీ నిరుద్యోగలుగా మిగిలి పోయారు.

ఈ సందర్భంగా వారు మట్లాడుతూ మానవతా దృక్పథంతో అవకాశం కల్పిస్తున్నామని చెప్పిన ప్రభుత్వం, 60ఏళ్ల వయస్సు నిబంధన పెట్టడంతో తామంతా ఉద్యోగార్హత కోల్పోయి, నిరుద్యోగులుగానే మిగిలి పోతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 62ఏళ్లుగా

ఆందోళన చేస్తున్న డిఎస్‌సి 98 అభ్యర్థులు

పెంచిన ప్రభుత్వం, డిఎస్‌సి 98 అభ్యర్థులకు మాత్రం 60ఏళ్ల నిబంధన పెట్టడం దుర్మార్గమన్నారు. అప్పట్లో తమకు అన్యాయం జరగకపోతే, ప్రస్తుతం 62ఏళ్ల వరకు ఉద్యోగంలోనే ఉండేవారమన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని తమకు న్యాయం చేయాలని, జిల్లాలో ఖాళీగా ఉపాధ్యాయ పోస్టుల్లో తమను భర్తీ చేయాలని కోరారు.

భవిష్యత్ సంపదగా మేధో హక్కులు

-ఏయూలో ఘనంగా ఐపిఆర్ దినోత్సవం
-పేటెంట్‌లు సాధించిన మహిళలకు సత్కారం

పేటెంట్లు సాధించిన మహిళలను సత్కరిస్తున్న ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్

ప్రజాశక్తి- విశాఖపట్నం : భావితరాలకు నిజమైన సంపదగా మేధో హక్కులే నిలుస్తాయని ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆంధ్రవిశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎయు రసాయన శాస్త్ర విభాగం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ మేధో హక్కుల దినోత్సవంలో మాట్లాడుతూ మనం సాధించిన పేటెంట్‌లను కమర్షియల్ చేయడం ద్వారా సంపదను సృష్టించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ఆవిష్కర్తలు ఆలోచించాలని సూచించారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా నూతన ఆవిష్కరణలకు, దేశీయంగా ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. పేటెంట్‌తో పాటు బ్రాండింగ్, ట్రేడ్ మార్క్ వంటివి చాలా అవసరమన్నారు. శాస్త్రీయ ఆవిష్కరణలు, పేటెంట్‌లు సాధించడంలో నేటి మహిళలు ప్రతిభ చూపుతున్నారన్నారు. ఎన్ఎస్‌టిఎల్ సైతం తన ప్రస్థానాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి ప్రారంభించిందని వెల్లడించారు.

ఎయు ఐపిఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ. దేశ ఆర్థిక ప్రగతి ఐపిఆర్‌పై ఆదారపడి ఉంటుందని, అందుకు ఐపిఆర్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవరం ఉందన్నారు. ఇప్పటికే 70 పేటెంట్‌లకు ఎయు దరఖాస్తు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, హబ్ సిఇఒ రవి ఈశ్వరపు, ఆచార్య శ్యామల పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ నుంచి పేటెంట్‌లు సాధించిన డాక్టర్ చందన లక్ష్మి, డాక్టర్ అపరంజిలను సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం తరపున ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావును సత్కరించారు.

బైక్‌కు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 53వ వార్డు డాక్టర్ జాకీర్‌హుస్సేన్ నగర్ వద్ద ఇంటి బయట పార్కింగ్ చేసిన స్కూటీకి గుర్తుతెలియని వ్యక్తి నిప్పు పెట్టాడు. ఘటనలో బైక్ పూర్తిగా దగ్ధమైంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి.

స్థానికంగా వెల్డింగ్ పనులు చేస్తున్న షేక్‌మదీనా వలి మంగళవారం రాత్రి విధులు ముగించుకొని, ఇంటిముందు తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేసాడు. బుధవారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో స్కూటీ నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో గుర్తించిన స్థానికులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సమీపంలో ఉన్న మరో రెండు బైక్‌లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాలనీలో ఉన్న సిసి కెమెరా ఫుటేజీని పరిశీలించగా, గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ పోసి స్కూటీకి నిప్పు పెడుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి.. సిఐ బిఎండి ప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐ శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శ్రీశ్రీ జీవితంపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ రసజ్ఞ వేదిక సంస్థ ప్రతినిధులు ద్వయం డాక్టర్ డి.వి.సూర్యారావు, మేడా మస్తాన్ రెడ్డి నేతృత్వంలో పౌర గ్రంథాలయంలో 'శ్రీశ్రీ జీవితం సమగ్ర సాహిత్యం'పై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. బుధవారం సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో బి.మణినాగేంద్రరావు మొదటి బహుమతికి ఎంపికకాగా, ద్వితీయ బహుమతికి శేఖరమంత్రి ప్రభాకరరావు, దుర్గా ప్రసన్న, డాక్టర్ మరడాన సుబ్బారావు ఎంపికయ్యారు. జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతికి బివి.రామకృష్ణ, ద్వితీయ బహుమతికి పి.సురేశ్‌కుమార్ ఎంపికయ్యారు. విజేతలకు ఈ నెల 30న సాయంత్రం ఐదున్నర గంటలకు అమ్మాసా హాలులో నిర్వహించే శ్రీశ్రీ జయంతి వేడుకల్లో నగదు బహుమతులను అందజేస్తామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గండికోట రఘురామారావు తెలిపారు.

ఘనంగా ఎయు వ్యవస్థాపక దినోత్సవం

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పిస్తున్న ఐఎంఎస్ఇ ప్రిన్సిపల్, విద్యార్థులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎయు పరిపాలనా భవనం వద్దనున్న వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి విసి ఆచార్య పివిజిడి ప్రసాద ండ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఏర్పాటుకు అసెంబ్లీలో బిల్లు పెట్టిన ఎపి పాత్రో విగ్రహానికి, ఎయు చిహ్నానికి పూలమాల వేసారు. శతాబ్ది ఉత్సవానికి చేరువవుతున్న ఆంధ్రవిశ్వవిద్యాలయం అభ్యున్నతిలోర్యులు, ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎయు స్నాతకోత్సవ మందిరం, సిరిపురం కూడలిలోని సిఆర్ రెడ్డి విగ్రహాలకు ఎయు అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపల్స్ ఎ.నరసింహారావు, కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, కె.విశ్వేశ్వరరావు, ఎస్‌కె భట్టి, మీడియా రిలేషన్స్ డైరెక్టర్ ఆచార్య చల్లా రామకృష్ణ, డీన్‌లు, డైరెక్టర్లు, అధికారులు, ఆచార్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐఎంఎస్ఇ విభాగం ఆధ్వర్యాన...

ఎయు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐఎస్ఇ విభాగం ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐఎస్ఇ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శోభశ్రీ, డాక్టర్ కృష్ణమంజరి పవార్, ఇసి సభ్యులు డాక్టర్ నాగరాజకుమారి, విజి చైర్మన్ డాక్టర్ హవీలా, డాక్టర్ విద్యావతి, డాక్టర్ తిరుమలాంబ, డాక్టర్శ్రీదేవి, డాక్టర్ ప్రసన్న,డాక్టర్ పుష్పరాజ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి -ములగాడ : ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో మల్కాపురం శివారు ప్రకాష్‌నగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన మేఘన, తిలక్‌లకు బుధవారం జిల్లా, జివిఎంసి మలేరియా సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం ఎల్ అరుణకుమారి బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా మలేరియా సిబ్బంది మాట్లాడుతూ, ఏటా మలేరియానిర్మూలన దినోత్సవం సందర్భంగా నిర్వహించే పోటీల్లో భాగంగా జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మణి ఆదేశాల మేరకు నోడల్ అధికారి నాగశ్రీను పర్యవేక్షణలో పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ డి రవికుమార్, జిల్లా మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్లు డి రాజ్‌కుమార్, రోమాల వేణుబాబు, సూపర్‌వైజర్ డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.